## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

❖ కాంగ్రెస్ శ్రేణులకు జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి పిలుపు



**దశ, ఇబ్రహీంపట్నం :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేడు ప్రారంభించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి కోరారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, యువజనులు, మహిళలు భారీగా తరలివచ్చి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆరుట్లలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతగా భావించి పాల్గొనాలని మంకాల శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## మోదీ 12 ఏళ్ల పాలన దేశ అభివృద్ధికి మైలురాయి

❖ డా. బూర నర్సయ్య గౌడ్.



**దశ, యాదాద్రి భువనగిరి :** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల పాలనలో సంక్షేమం, మౌలిక సదుపాయాలు, డిజిటల్ విప్లవం, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, జాతీయ భద్రత రంగాల్లో చారిత్రాత్మక విజయాలు సాధించిందని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "సబ్కా సాథ్-సబ్కా వికాస్" లక్ష్యంతో మోదీ ప్రభుత్వం దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్ దిశగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల, జన్ ధన్, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనకు ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరు శ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేష్, కర్నాటి ధనంజయ్, పాశం భాస్కర్, రచ్చా శ్రీను, చందా మహేందర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేగంగా దూసుకొచ్చిన కారు.. కాడెడ్ల ప్రాణాలు బలి

*ఎడ్ల బండిని ఢీకొన్న వాహనం.. రైతుకు తీవ్ర గాయాలు.*

**దశ, శాలిగౌరారం :** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాడెడ్లు మృతి చెందగా, రైతు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, పెర్కకొండారం గ్రామానికి చెందిన బండారు రామ్మూర్తి ఎడ్ల బండితో గ్రామ శివారులోని జాతీయ రహదారిపై వెళ్తుండగా, నకిరేకల్ నుంచి అర్వపల్లి వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఎడ్ల బండిని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రెండు కాడెడ్లు అక్కడికక్కడే మృతి చెందగా, ఎడ్ల బండి నడుపుతున్న రైతు రామ్మూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన రైతును చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కాడెడ్లు మృతి చెందడంతో పాటు ఎడ్ల బండి కూడా ధ్వంసమై సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

# యాచారం-మేడిపల్లి రహదారి పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం





❖ ఆరు నెలలుగా కొనసాగుతున్న పనులు –

❖ మల్కీస్ గూడెంలో కల్వర్టు నిర్మాణం మరిచిన అధికారులు

**దశ, యాచారం:** మండల పరిధిలోని యాచారం నుంచి మేడిపల్లి వరకు చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు గత ఆరు నెలలుగా కొనసాగుతున్నప్పటికీ ఇప్పటికీ పూర్తికాకపోవడం స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ రహదారి పనులు ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. యాచారం-మేడిపల్లి ప్రధాన రహదారి పరిధిలో అనేక చోట్ల తవ్వకాలు నిర్వహించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. యాచారం నుంచి వెళ్లే మార్గంలో రాత్రి వేళల్లో వెలుతురు సదుపాయం లేకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని పేర్కొంటున్నారు.

గ్రామస్తుల మాటల్లో, పనులు ప్రారంభించిన సమయంలో అధికారులు త్వరలోనే రహదారి పూర్తవుతుందని హామీలు ఇచ్చారని, కానీ నెలలు గడిచినా ఎలాంటి పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాలు జారిపడే పరిస్థితులు నెలకొన్నాయి. పాఠశాల విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, అత్యవసర సేవల కోసం ప్రయాణించే ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్కీస్ గూడెం వద్ద కల్వర్టు నిర్మాణం లేకపోవడం వల్ల భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహం నేరుగా రహదారిపైకి వచ్చే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల రహదారి నాణ్యత దెబ్బతినడంతో పాటు ప్రజల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి పనులను వేగవంతం చేయాలని, మల్కీస్ గూడెం వద్ద అవసరమైన కల్వర్టు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా పనుల నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆరు నెలలుగా సాగుతున్న ఈ రహదారి నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ప్రజలు ఎదురుచూస్తున్నారు. అభివృద్ధి పేరుతో ప్రారంభమైన పనులు ప్రజలకు ఇబ్బందులుగా మారకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

"రోడ్డు వేస్తున్నారు కానీ కల్వర్టు కట్టడం మర్చిపోయారు... ఆరు నెలలుగా ప్రజలు కష్టాలు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పనులు పూర్తి చేయాలి" అని మల్కీస్ గూడెం గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## 2014లో నియమితులైన అధ్యాపకులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి: ఔట

**దశ,ఓయూ:** తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2014లో నియామకం పొందిన అధ్యాపకులందరికీ రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ తుది తీర్పులకు లోబడి షరతులతో కూడిన పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔట) రాష్ట్ర నాయకత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరికి టౌటా రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ చలమల వెంకటేశ్వర్లు, సలహాదారులు ప్రొఫెసర్ సి. కాసిం, ప్రొఫెసర్ అక్తర్ అలీ, ప్రొఫెసర్ మద్దిలేటి తదితరులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అన్ని శాఖల్లో పదోన్నతుల విషయంలో సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తున్న నేపథ్యంలో తెలంగాణ విశ్వవిద్యాలయంలో కూడా పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని వారు కోరారు. గత 12 సంవత్సరాలుగా అధ్యాపకులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌటా ప్రతినిధులు డాక్టర్ ఎ. పున్నయ్య, డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ అడికే నాగరాజు, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ నీలిమ, డాక్టర్ శిరీష, డాక్టర్ పాత నాగరాజు, డాక్టర్ జమీల్ అహ్మద్, డాక్టర్ లక్ష్మణ్ చక్రవర్తి, డాక్టర్ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ హుక్కా సెంటర్లపై పోలీసుల ఉక్కుపాదం

❖ మల్కాజ్‌గిరిలో ప్రత్యేక దాడులు.. 4 కేసులు నమోదు, 7 మంది అరెస్ట్.

❖ 14 కేంద్రాల తనిఖీ.. నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై చర్యలు



**దశ, మల్కాజ్‌గిరి:** అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్లు, కేఫ్‌లపై మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్ టీమ్ (SOT) పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై కేసులు నమోదు చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, మొత్తం 14 హుక్కా సెంటర్లు, కేఫ్‌లను తనిఖీ చేయగా నాలుగు కేంద్రాల్లో అక్రమ కార్యకలాపాలు గుర్తించారు. దీంతో నాలుగు కేసులు నమోదు చేసి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. హుక్కా సెంటర్ల పేరుతో ప్రజారోగ్యానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ హెచ్చరించింది. సంబంధిత అనుమతులు, లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సామగ్రిని స్వాధీనం చేసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. కమిషనరేట్ పరిధిలో ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఎక్కడైనా అక్రమ హుక్కా సెంటర్లు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ దాడులు మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి పర్యవేక్షణలో, SOT డీసీపీ కె. మనోహర్ మార్గదర్శకత్వంలో నిర్వహించారు.

# డంపింగ్ యార్డ్ రద్దు చేయాలి

❖ మంత్రులను కలిసి వినతిపత్రం అందజేసిన బాధిత గ్రామాల సర్పంచులు

❖ ప్రజారోగ్యానికి ముప్పు తెచ్చే ఎకో టౌన్‌ను అనుమతించొద్దని విజ్ఞప్తి

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల సర్వే నంబర్ 268లో ప్రతిపాదించిన ఎకో టౌన్ (డంపింగ్ యార్డ్) ప్రాజెక్టును వెంటనే రద్దు చేయాలని బాధిత గ్రామాల సర్పంచులు రాష్ట్ర మంత్రులను కోరారు. డీసీసీ అధ్యక్షుడు క్యామ మల్లేష్ (రాఘవరెడ్డి), మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ, పచ్చని వ్యవసాయ భూములు, జనావాసాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ-20ను వెంటనే రద్దు చేసి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని మంత్రులను కోరినట్లు తెలిపారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు, కాలుష్య ముప్పు తీసుకొచ్చే ప్రాజెక్టులను గ్రామాలపై రుద్దవద్దని వారు స్పష్టం చేశారు. ఈ విషయంపై మంత్రులు సానుకూలంగా స్పందించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో చిన్న రావిరాల సర్పంచ్ పబ్బతి బాలకిషన్ గౌడ్, పిల్లాయిపల్లి సర్పంచ్ పెరుమాండ్ల మహాలక్ష్మి దానయ్య, జగత్‌పల్లి సర్పంచ్ ఇట్టముని గీత మహేష్, పిల్లాయిపల్లి ఉపసర్పంచ్ బందారపు లక్ష్మణ్ గౌడ్, నాయకులు కవాడి శ్రీనివాస్ రెడ్డి, కళ్లెం శ్రీధర్ రెడ్డి, కళ్లెం ధర్మారెడ్డి, కొత్త అరుణ్ గౌడ్, మోలుగు అర్జున్, సతీష్ రెడ్డి, నెమురగోముల మహేష్, పల్లపు సురేష్, గడ్డం ప్రవీణ్ గౌడ్, గండికోట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.






# 20 వేల ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులతో వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలి: తెలంగాణ నిరుద్యోగ జేఏసీ

**దశ ఓయూ:** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను 20 వేలతో భర్తీ చేస్తూ తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత ఉస్మానియా యూనివర్సిటీలో భారీ ర్యాలీ నిర్వహించింది.

ఈ సందర్భంగా మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వం కేవలం ఐదు వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేస్తే జీవో నంబర్ 46 ప్రకారం రెండు వేల పోస్టులు హైదరాబాద్‌కు కేటాయింపవుతాయని, మిగిలిన మూడు వేల పోస్టులు రాష్ట్రంలోని 33 జిల్లాలకు పంపిణీ అవుతాయని తెలిపారు. ఈ పరిస్థితిలో ప్రతి వర్గానికి అవకాశాలు తగ్గిపోతాయని పేర్కొన్నారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేల పోస్టులతో కాకుండా 20 వేల ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులతో కూడిన నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగుల డిమాండ్లను పట్టించుకోకపోతే ఉద్యమాల గడ్డ అయిన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మరో ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. అలాగే నోటిఫికేషన్‌లో లాంగ్ జంప్ అర్హతను 3.5 మీటర్లకు పరిమితం చేయాలని, ఎస్సై పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, కానిస్టేబుల్ పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని కోరారు. జీవో నంబర్ 46ను రద్దు చేయడంతో పాటు దరఖాస్తు ఫీజును రూ.1,000 నుంచి రూ.100కు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో మొండి వైఖరి అవలంబిస్తే రాష్ట్రంలోని 33 జిల్లాల యువత పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతుందని మోతిలాల్ నాయక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ మహిళా అధ్యక్షురాలు అస్మా, ప్రధాన కార్యదర్శి ఆర్.కే. వన్నార్ చోళ, అనిత ముదిరాజ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# యూటీ నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**దశ,బూర్గంపాడు:** మండలంలోని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మంగళవారం పర్యటించి, నకిరేపేట గ్రామ పరిధిలోని దోమలవాగు చెరువుకు సీతారామ కాలువ నుంచి నీటి మళ్లింపునకు నిర్మించనున్న యూటీ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,,,, దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.20 లక్షల వ్యయంతో యూటీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు . అశ్వాపురం,బూర్గంపాడు మండలాల్లోని ప్రతి ఎకరానికి సీతారామ కాలువ ద్వారా గోదావరి జలాలు అందేలా కృషి చేస్తున్నామని, రైతుల సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి, రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద లింకులతో జర భద్రం: భద్రాద్రి పోలీస్

**దశ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో :** తక్కువ వడ్డీతో వెంటనే లోన్ ఇస్తామని చెప్పే నకిలీ లింకులు, ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో డబ్బులు అడిగే మోసగాళ్ల పట్ల జరా భద్రంగా ఉండాలని భద్రాద్రి జిల్లా పోలీసులు మంగళవారం హెచ్చరించారు.ముఖ్యంగా పీఎం ముద్ర లోన్ల పేరుతో జరుగుతున్న మోసాలపై జాగ్రత్త వహించాలని సూచించారు.అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ముందస్తుగా ఎలాంటి ఫీజులు చెల్లించవద్దని ప్రజలకు సూచనలు చేస్తున్నారు. ఆన్లైన్లో తెలియని లింకులు లిఫ్ట్ చేయడం వల్ల మోసగాళ్లు తమ ఖాతాలోని నగదు మాయం చేస్తారని ఎలాంటి లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసగాళ్లు రోజురోజు కొత్త పుంతలు తొక్కుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసగాళ్ల బారిన పడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## మేము సైతం మిత్ర మండలి ఆర్థిక సహాయం



**దశ, మణుగూరు:** మేము సైతం మిత్రమండలి ట్రస్ట్ దహన సంస్కారాలకు కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. మణుగూరు మండలంలోని విజయనగరం ప్రాంతానికి చెందిన జోగు తిరుపతమ్మ 45 సంవత్సరాలు విద్యుత్ షాక్‌తో మంగళవారం మరణించారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మేము సైతం మిత్రమా ట్రస్ట్ స్పందించి మృతురాలు నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి 3000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి రంగా శ్రీనివాసరావు, అంబులెన్స్ డ్రైవర్ ప్రదీప్, ట్రస్ట్ సభ్యులు జగన్ మోహన్, చిందుకూరి రామారావు, తమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

❖ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**దశ, హైదరాబాద్:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించి కాలనీవాసుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్‌తో కలిసి కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే, స్థానికుల నుంచి మంచినీరు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను వివరించిన ప్రజలు వెంటనే పరిష్కారం కావాలని ఎమ్మెల్యేను కోరారు.ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి కొరత రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులతో సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు.



## గంజాయిని తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

**దశ, బూర్గంపాడు :** అక్రమంగా ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు.ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిస్సా నుండి ములుగు జిల్లా మంగపేట గ్రామానికి బజాజ్ పల్సర్ బైక్ పై అక్రమంగా గంజాయి తరలిస్తుండగా సారపాక పల్లె ప్రకృతి వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనబడడంతో బూర్గంపాడు ఎస్సై ప్రసాద్ వారిని తనిఖీ చేయగా 2.1 కేజీ లా గంజాయి ఉండడంతో వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో మంగపేట మండలానికి చెందిన బడే భరత్, ఉప్పరపల్లి వెంకటేష్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. వీరి వద్దనుండి ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరాలు తెలిపారు. ఈ గంజాయి విలువ లక్ష ఐదువేలు ఉంటుందని అన్నారు.

## ఎల్లాపురం గ్రామస్థులకు ఇందిరమ్మ ఇళ్ళు, ఇంటి స్థలం కేటాయిస్తా: ఎమ్మెల్యే పాయం



**దశ, పినపాక :** మండలంలోని పోట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లా పురం గ్రామస్థులు తమ సమస్యలు పై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను కలిసి వినతి పత్రం అందించారు . గత కొన్నేళ్లుగా ప్రమాదకరంగా మారిన పెద్ద వాగు పక్కన ఉంటూ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని, ఏ క్షణంలో ఏ ప్రమాదం వస్తుందో తెలియక ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని మొర పెట్టుకున్నారు.

వారి సమస్యలు, పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని ఎల్లాపురం గ్రామస్థులను అక్కడి నుంచి ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతంలో ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయించి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం తో గ్రామస్థులు ఆనందం, హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు గొగ్గల రామకృష్ణ, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొమరం శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక సమస్య ఆర్టీఏ సేవలకు అంతరాయం

**దశ, హైదరాబాద్:** సాంకేతిక సమస్య కారణంగా ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయంలో సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా వాహన్, సారథి సర్వర్లు మొరాయించడంతో గత రెండు రోజులుగా రవాణా శాఖ సేవలు నిలిచిపోయాయి. లెర్నింగ్ లైసెన్స్‌లు, డ్రైవింగ్ లైసెన్స్ పనులు, అలాగే వాహన రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి కౌంటర్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని వచ్చిన యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు సర్వర్ సమస్య కారణంగా పనులు పూర్తికాక నిరాశతో వెనుదిరిగారు.కౌంటర్లు తెరిచి ఉన్నప్పటికీ ఆన్‌లైన్ వ్యవస్థ పనిచేయకపోవడంతో అధికారులు కూడా సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది.ఈ సందర్భంగా ఉప్పల్ ఆర్టీఏ అధికారి సురేష్ రెడ్డి మాట్లాడుతూ..

వాహన్, సారథి సేవలు ఢిల్లీ కేంద్ర సర్వర్ ద్వారా నిర్వహించబడతాయని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సర్వర్ సమస్య తలెత్తడంతో సేవలకు అంతరాయం ఏర్పడిందని ఆయన వివరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. సర్వర్ కనెక్షన్ పునరుద్ధరించగానే సేవలు మళ్లీ సాధారణ స్థితికి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్న వారు సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ అపాయింట్‌మెంట్‌లను వాయిదా వేసుకోవాలని అధికారులు సూచించారు.



## మత్తు పదార్థాల నిర్మూలనలో బాధ్యతగా ఉండాలి

❖ సీపీ అంబర్ కిషోర్ ఝా



**దశ, బెల్లంపల్లి:** రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. మంచిర్యాల జోన్ పరిధిలోని బెల్లంపల్లి డివిజన్ తాళ్ల గురజాల గ్రామంలో బెల్లంపల్లి రూరల్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'అరైవ్‌అలైవ్' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.వాహనం నడపడం బాధ్యతతో కూడుకున్నదని, 18 ఏళ్లు నిండిన వారే డ్రైవింగ్ చేయాలని సూచించారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా రక్షించబడతాయని పేర్కొన్నారు.యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సీపీ సూచించారు. క్షణిక ఆనందం కోసం వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. బాధితులను ఆదుకునేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నప్పటికీ, మత్తు పదార్థాల సరఫరాదారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలే ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని చెప్పారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. మైనర్ డ్రైవింగ్‌ను ప్రోత్సహిస్తే తల్లిదండ్రులు, వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఆర్మీ, పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువకులు పుష్‌అప్స్ ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వారి ప్రతిభను అభినందించిన సీపీ అంబర్ కిషోర్ ఝా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఓ యువకుడిని శాలువాతో సత్కరించి రూ.500 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్, ఎస్ఐలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.